క్లుప్తంగా

మహాత్ముడికి గుడి


గాంధీకి నిర్మించిన గుడి

రాజాం: పట్టణంలో పోలీస్ స్టేషన్‌కు ఆనుకుని ఉన్న శెగిడి వీధిలో గాంధీజీకి స్థానికులు గుడి కట్టి పూజిస్తున్నారు. 1996లో స్థానికంగా ఉన్న దొంతంశెట్టి రమణ గాంధీజీ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వీధిలో నివాసముంటున్న పైడిరాజు, డి.మలయ్యలు అప్పట్లో ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు ముందుకువచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. అనంతరం విగ్రహాన్ని ప్రతిష్ఠించిన చోటే చిన్నగుడి కూడా కట్టారు. అప్పటి నుంచి ఈ వీధి పేరు శెగిడివీధి నుంచి గాంధీ వీధిగా మారిపోయింది. ఏటా గాంధీ జయంతి, వర్ధంతి రోజున ఇక్కడ పూజా కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

నేడు నందబలగలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

తెర్లాం: మండలంలోని నందబలగ గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శంబంగి రామకృష్ణ ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ గర్బాపు ఊర్మ, ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు పాల్గొంటారని, మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని కోరారు.

త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారం

రాజాం: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఆదివారం త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక బొద్దాం కమిటీ సభ్యులు భగవద్గీత కొత్త గ్రంథాలను ఆవిష్కరించారు. రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు చేతులమీదుగా వీటిని ఆవిష్కరించి, పలువురికి అందజేశారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక బొద్దాం కమిటీ సభ్యులు పట్నాన అప్పలనరసయ్య, గుండ కృష్ణ, కుప్పిలి ప్రసాదరావు, బట్న శ్యామ్‌కుమార్, బట్న రమేష్, శంకరరావు, వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, గుంటముక్కల సప్తగిరి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా గణనాథుని ఊరేగింపు

రాజాం: పట్టణంలోని మాధవబజార్‌లో వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహ నిమజ్జనం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, డీజే డాన్సులతో స్వామివారి ఊరేగింపు అట్టహాసంగా సాగింది.

ఘనంగా జాషువా జయంత్యుత్సవాలు ప్రారంభం

బొబ్బిలి: స్థానిక సంగం వీధిలో కవి గుర్రం జాషువా 128వ జయంత్యుత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపకుడు, అంబేడ్కర్ సాహితీ పీఠం కన్వీనర్ సోరు సాంబయ్య తొలుత నవయుగ చక్రవర్తి, కవికోకిల అయినటువంటి జాషువా రచనలు, సమాజంపై వాటి ప్రభావంను వివరించారు. అనంతరం పిల్లలకు మిఠాయిలు, నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ నెల 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు జాషువా జయంత్యుత్సవాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సి.హెచ్.సత్యనారాయణ, సీనియర్ న్యాయవాది ఎస్.జె.విల్సన్ బాబా, అంబేడ్కర్ సాహితీ పీఠం కో కన్వీనర్ బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

రాజాం: పట్టణంలోని వాసవీనగర్‌లో వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, గుంటముక్కల సప్తగిరి, కమిటీ సభ్యులు పాలవలస శ్యామ్, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

కొప్పరవలసలో..

వంగర: మండలంలోని కొప్పరవలసలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రామభద్రపురం: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని కనిమెరక వీధిలో అన్నదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, బొబ్బిలి ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు కలిసి, భక్తులకు అన్నం వడ్డించారు. సోంపురం, తారాపురం, బూసాయవలస, ఎస్.సీతారంపురం తదితర గ్రామాలకు చెందిన దాదాపు 10 వేల మంది భక్తులు స్వామి అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో మండల మహిళా నాయకురాలు అప్పికొండ నిర్మల, ఎంపీటీసీలు బవిరెడ్డి చంద్ర, వసంతుల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతే లక్ష్యం


వంగర: జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణాన్ని శుభ్రం చేస్తున్న తహసీల్దార్ డి.ఐజాక్, ఎంపీడీవో శశిభూషణరావు, తదితరులు

గార్బేజ్ ఫ్రీ ఇండియా(చెత్త రహిత భారతదేశం) లక్ష్యంగా స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ప్రధాన రోడ్లు, కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు, సముద్ర, నదీతీర ప్రాంతాల్లోని చెత్తాచెదారం ఏరివేసి, పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం అవగాహన ర్యాలీలు చేపట్టి, ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని వక్తలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా పలుచోట్ల గ్రీన్ అంబాసిడర్లను సన్మానించి, స్వచ్ఛ భారత్‌కు సహకరించాలని కోరారు.

–సాక్షి నెట్‌వర్క్


రాజాం సిటీ: అంబేడ్కర్ జంక్షన్ వద్ద ఐఎస్ఎల్ ఆకారంలో ఎన్‌సీసీ, ఆశావర్కర్ల ప్రదర్శన


రాజాం సిటీ: ఎంపీడీవో కార్యాలయం ఆవరణాన్ని శుభ్రం చేస్తున్న జెడ్పీటీసీ నర్సింహులు, తదితరులు


రేగిడి: బూరాడలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు


రేగిడి: ఎమ్మార్వో కార్యాలయంలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న ఎంఈవో ప్రసాదరావు, సిబ్బంది


బాడంగి: బాడంగి గ్రంథాలయం వద్ద పిచ్చిమొక్కలు తొలగిస్తున్న లైబ్రేరియన్ దుర్గాప్రసాద్, విద్యార్థులు


తెర్లాం–2 సచివాలయం వద్ద పిచ్చిమొక్కలు తొలగిస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి, సర్పంచ్ రూప, ఎంపీడీవో రామకృష్ణ


రాజాం: పొగిరిలో ర్యాలీ చేస్తున్న సర్పంచ్ పొగిరి కృష్ణవేణి, తదితరులు


బొబ్బిలి: జగన్నాథపురంలో జరిగిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి తదితరులు


రామభద్రపురం: తహసీల్దార్ కార్యాలయ ఆవరణాన్ని చీపుళ్లతో శుభ్రం చేస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, తహసీల్దార్ రాజారావు


తెర్లాంలో గ్రీన్ అంబాసిడర్లను సన్మానిస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి తదితరులు


రాజాం: గడిముడిదాంలో శ్రమదానం చేస్తున్న ఎంపీపీ లావేటి సులోచన, తదితరులు


సంతకవిటి: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు

ఠంచన్‌గా పింఛన్ల పంపిణీ

వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం కింద అర్హులైన వారందరికీ ఆదివారం పింఛన్లు పంపిణీ చేశారు. వేకువజాము 5:30 గంటల నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు నేరుగా వెళ్లి, పింఛన్ నగదు అందజేశారు. తెర్లాంలో 90 శాతం, రామభద్రపురంలో 93 శాతం, బాడంగిలో 75 శాతం మేర పెన్షన్ల పంపిణీ చేసినట్లు ఆయా మండలాల ఎంపీడీవోలు పేర్కొన్నారు. గతంలో టీడీపీ హయాంలో లాగా కాకుండా ప్రస్తుతం వైఎస్సార్ సీపీ పాలనలో ఇంటి వద్దకే పింఛన్లు అందిస్తుండడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

–సాక్షి నెట్‌వర్క్


తెర్లాంలో పింఛన్ ఇచ్చేందుకు వృద్ధురాలితో బయోమెట్రిక్ వేయిస్తున్న వలంటీర్ గౌరీశ్వరి


రేగిడి: వన్నలిలో పొలంలో పనిచేస్తున్న వృద్ధుడి వద్దకు వెళ్లి, పింఛన్ అందజేస్తున్న సచివాలయ సిబ్బంది


రామభద్రపురం: పెదపల్లి వీధిలో పింఛన్ల పంపిణీ చేస్తున్న వలంటీర్

గ్రూపు–1 విజేతకు సత్కారం


గ్రూపు–1 విజేతను సత్కరిస్తున్న వికాసతరంగిణి సభ్యులు

రాజాం సిటీ: ఇటీవల విడుదలైన గ్రూపు–1 ఫలితాల్లో ప్రతిభకనబరిచి స్టేట్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్‌గా నియమితులైన వావిలపల్లి భార్గవ్‌ను వికాసతరంగిణి సభ్యులు ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా వికాసతరంగిణి సభ్యురాలు గెడ్డాపు శ్రీలక్ష్మి మాట్లాడుతూ భార్గవ్ విజయం ఈ ప్రాంతంలో ఎంతో మంది యువతకు స్ఫూర్తినిస్తుందన్నారు. తెలుగు మాధ్యమంలో చదువుకున్నప్పటికీ గ్రూపు–1లో ప్రతిభ కనబర్చడం గర్వకారణమని కొనియాడారు. కార్యక్రమంలో వికాసతరంగిణి సభ్యులు అమనాన నీలకంఠం, అమనాన లలిత, వాకచర్ల పైడిరాజు, గడే అప్పలనాయుడు, మురపాక గణేష్, కొరికాన శ్రీనివాసరావు, అబ్బులు పాల్గొన్నారు.

సందడిగా వినాయక నిమజ్జనోత్సవం

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని కోరాడ వీధి వినాయక నిమజ్జనోత్సవం ఆదివారం సందడిగా జరిగింది. మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ గణేశుని విగ్రహ ఊరేగింపు జరిగింది. అమ్మవార్ల వేషధారణలు, డీజే పాటలకు యువతీ, యువకులు చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాత్రి గణనాథుని విగ్రహాన్ని సమీప నదికి తీసుకువెళ్లి, నిమజ్జనం చేశారు.

ఎం.ఎస్.స్వామినాథన్‌కు నివాళి


స్వామినాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రైతు సంఘ నాయకులు

రేగిడి: హరిత విప్లవం ద్వారా దేశంలో ఆకలి కొరత తీర్చిన మహనీయుడు డాక్టర్ ఎమ్.ఎస్.స్వామినాథన్ అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని సంకిలి గ్రామంలో ఆదివారం డాక్టర్ స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆహార పంటలు స్వయం సమృద్ధిని సాధించాలని కృషిచేసిన వ్యక్తి స్వామినాథన్ అన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు రూపకల్పనచేసి, తన ఆలోచనలను పోరాటాలు ద్వారా సాధించి, అతి తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడి ఇచ్చే గోధుమ, వరి తదితర ఆహార పంటలకు కావాల్సిన సాగునీటిని సాధించారని తెలిపారు. ఎన్నో ప్రయోగాలు, పోరాటాలు చేశారని వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు నారు జనార్దనరావు, పాలవలస రామినాయుడు, శ్రీనివాసరావు, రాములు, భీమారావు తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముని ఆశయాల సాధనకు కృషిచేయాలి

- ఆర్డీఓ ఎం.అప్పారావు


గాంధీ విగ్రహాలను ఉపాధ్యాయులకు అందిస్తున్న ఆర్డీఓ, తదితరులు

రాజాం సిటీ: మహాత్మా గాంధీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని చీపురుపల్లి ఆర్డీఓ ఎం.అప్పారావు అన్నారు. స్థానిక లక్ష్మీగ్యాస్ ఏజెన్సీ అధినేత కొత్తా అనంతరావు సమకూర్చిన 12 గాంధీజీ విగ్రహాలను ఆదివారం వివిధ ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ మహాత్మా గాంధీ సత్యం, అహింసలనే ఆయుధాలుగా చేసుకుని స్వాతంత్ర్యం కోసం పోరాటం చేశారని, జాతిపితగా ఖ్యాతిగాంచారని అన్నారు. విగ్రహాలను పాఠశాలల్లో ఏర్పాటుచేయడంతో పాటు మహాత్ముని జీవిత చరిత్ర, ఆయన ఆశయాలను విద్యార్థులకు తెలియజేయాలని కోరారు. విగ్రహాల దాత కొత్తా అనంతరావు మాట్లాడుతూ తన తండ్రి దాలిరాజు గాంధేయవాదని, బాపూజీ బాటలోనే జీవనాన్ని కొనసాగించారని అన్నారు. తండ్రి చూపిన బాటలోనే మహాత్ముని ఆశయాల ప్రచారానికి కృషిచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గాంధీ స్మారకనిధి రాజాంశాఖ కన్వీనర్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, రాజాం టౌన్, రూరల్ సీఐలు కె.రవికుమార్, హెచ్.ఉపేంద్ర, ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ కార్యదర్శి బీవీ అచ్యుత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, డి.రాజా, పి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

చీడపీడల నివారణకు జీవామృతం మేలు


జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం సిబ్బంది

రేగిడి: జీవామృతంతో పంటలకు మేలు చేకూరుతుందని ఏటీ జి.మురళీకృష్ణ, ప్రకృతి వ్యవసాయం ట్రైనీ మాస్టార్ రమాదేవి అన్నారు. మండలంలోని ఉంగరాడ యూనిట్ పరిధిలోని సోమరాజుపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న కోట్ల నారాయణరావుకు చెందిన వరి పంటను ఆదివారం పరిశీలించారు. గ్రామంలోని 25 మంది సభ్యులు ఐదు బందాలుగా ఏర్పడి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. అనుకూలమైన నేల, వాతావరణం, నీటి అనుకూలత తదితర అంశాలను పరిశీలించారు. చీడపీడల నివారణకు ఉపయోగించే కషాయాల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రైనీ మాస్టర్ కిరణ్, ఐసీఆర్‌పీ పైల తవిటినాయుడు, వీహెచ్‌ఏ అసిరినాయుడు, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్


ఆడవరంలో విద్యుత్ లైన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: ప్రజా సమస్యల పరిష్కారమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని ఆడవరం గ్రామంలో ఎంపీ నిధులు రూ.3.54 లక్షలతో చేపట్టిన అదనపు విద్యుత్ లైన్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సహకారంతో ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేసేందుకు వీలుగా అదనపు విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు, సర్పంచ్ మొయ్యి కృష్ణమూర్తినాయుడు, మొయ్యి రామారావు మాస్టారు, కర్నేన శరత్‌కుమార్, పోలేటి వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ కింజరాపు సురేష్‌కుమార్, మండల విప్ మజ్జి శ్రీనివాసరావు, పాడి లక్ష్మునాయుడు, కరణం గోవిందరావు, కెంబూరు వెంకటేశ్వరరావు, కరణం శ్రీనివాసరావు, ఎలక్ట్రికల్ ఎస్ఈ హరి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యక్రమాలు చూసి, జనం నవ్వుకుంటున్నారు..


మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ సీనియర్ నేతలు వేణుగోపాలనాయుడు, నిర్మల

రామభద్రపురం: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా టీడీపీ నేతలు చేస్తున్న విచిత్రమైన కార్యక్రమాలు చూసి, ప్రజలు నవ్వుకుంటున్నారని వైఎస్సార్ సీపీ సీనియర్ నేతలు శంబంగి వేణుగోపాలనాయుడు, అప్పికొండ నిర్మల అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం మీడియాతో మాట్లాడిన వారు అవినీతికి పాల్పడి, జైల్లో ఉన్న చంద్రబాబును చూసి, సిగ్గుపడాల్సింది పోయి వీధుల్లోకి వచ్చి ఆ పార్టీ నేతలు కంచాలు, గంటలు మోగించమనడం, విజిల్స్ వేయమనడం, వాహనాల హారన్లు మోగించమనడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ఇలా చంద్రబాబు అవినీతిని టీడీపీ నాయకులు సమర్థిస్తుండడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. టీడీపీ నిర్వహించిన రాష్ట్ర బంద్‌ను సైతం జనం ఖాతరు చేయలేదన్నారు. టీడీపీ చేస్తున్న ఏ ఒక్క కార్యక్రమంను జనం సీరియస్‌గా తీసుకోవడం లేదన్నారు. 2024 ఎన్నికలకు ముందే టీడీపీ అడ్రస్ గల్లంతయ్యే పరిస్థితి కనిపిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలం నాయుడు, నాయకులు దర్రు పైడిరాజు, పత్తిగుళ్ల ఏక్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

సేల్ నోటీసు

మహారాజశ్రీ, రాజాం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EP. 12/2019 in OS 8/2016

Between
ఐఖ వెంకటరావు — డిక్రీహోల్డర్ / వాది
And
సురవరపు కృష్ణారావు — జడ్జిమెంట్‌డెటార్/ప్రతివాది
To

శ్రీ సురవరపు కృష్ణారావు, తండ్రి సుందరరావు, సా॥ సుందరావు గ్రామం, సంతకవిటి మండలం, శ్రీకాకుళం జిల్లా ప్రస్తుతం విజయనగరం జిల్లా
[illegible] EP 12/2019లో EP [illegible] ఆస్తిని అమ్మకం [illegible] డిక్రీప్రకారం [illegible] పలుమార్లు పై కోర్టువారు నోటీసులు పంపుచున్నప్పటికీ [illegible] నోటీసులను [illegible] ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు చేయనైనది. పై కోర్టువారు తే 16.10.2023 దికి వాయిదాగా [illegible] కావున ఆరోజు ఉదయం గం॥ 10.30 నిలకు పైకోర్టు వారి ఎదుట మీరు స్వయంగాగాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీకుగల అభ్యంతరములను తెలుపుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమందు [illegible] మీకు తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులమేరకు)
రాజాం
తేది: 10.09.2023

[illegible] రవి
డిక్రీహోల్డరు వాది తరుపు
అడ్వకేట్, పాలకొండ

ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం


రాజాం సిటీ: అంతకాపల్లిలో వృద్ధురాలిని సత్కరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

రామభద్రపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజారావు ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు 80 ఏళ్లు దాటిన వృద్ధులను సన్మానించి, వృద్ధుల గొప్పతనం వివరించారు. పెద్దలను గౌరవించడమనేది మనందరి బాధ్యతగా భావించాలన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ సీహెచ్ సింహాచలంనాయుడు, వీఆర్‌వోలు పి.శ్రీనివాసరావు, అప్పలనాయుడు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో శేషశైలజ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం ఆదివారం నిర్వహించి, 80 ఏళ్ల వయసు దాటిన వృద్ధులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మణరావు, తహసీల్దార్ రాజేశ్వరరావు, డీటీ గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: మండలంలోని అంతకాపల్లి, పొగిరి, రాజయ్యపేట, కంచరాం, బొద్దాం, పెనుబాక గ్రామాల్లో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించి, 80 ఏళ్లు దాటిన వారందరినీ సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు వి.చిన్నారావు, వీఆర్‌వో ఎ.లక్షుంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చుతో గ్రావెల్‌రోడ్డు నిర్మాణం

వంగర: మండలంలోని కొండచాకరాపల్లి ఎస్ఎస్ చానల్ కల్వర్టు నుంచి పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం గౌరీపురం గ్రామం వరకు గ్రావెల్ రోడ్డును నిర్మిస్తున్నారు. గతంలో వేసిన గ్రావెల్ రోడ్డు పూర్తిగా పాడవడంతో బలిజిపేటకు చెందిన పీఎస్ఎన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ పూడి హరిప్రసాదరావు సొంత ఖర్చులతో ట్రాక్టర్లతో గ్రావెల్ తెప్పించి సుమారు కిలోమీటరు మేర రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో బలిజిపేట, వంగర మండలాలకు చెందిన ప్రజలు, వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వృద్ధుల ఆకలి తీరుస్తూ..


వృద్ధులకు భోజనాలు పెడుతున్న సిద్ధార్థ

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థ గత 1350 రోజులుగా నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నాడు. దాతల సహకారంతో ప్రతిరోజు రెండు పూటలా సుమారు 30 మంది వృద్ధులకు అన్నసంతర్పణ చేస్తూ వారి ఆకలి తీర్చుతున్నారు.